## ఏడవకమ్మా ఏడవకు

కుర్చీలకు
అంగవైకల్యమొచ్చింది
నల్లబల్లలన్నీ
బట్టతలలతో బాధపడుతున్నాయి
గోడలన్నీ నోళ్ళు తెరిచి
దీనంగా రోధిస్తున్నాయి
పైకప్పు పెచ్చులూడి
చచ్చుబడిపోయింది
మొత్తంగా బడి ఇప్పుడు
ఓ పురావస్తు అవశేషంగామారింది
వృద్ధులకుమల్లే
ఎవ్వరికీ పట్టింపులేనిదైంది.

ఏడవకమ్మా ఏడవకు
ఎంతోమందికి జ్ఞానభిక్షపెట్టి
సమాజసౌధానికి పునాదులేసిన దానివి
నువ్వేడిస్తే ఎలా!

ఎవరో ఒకరు , ఎప్పుడో ఒకప్పుడు
నువ్వు పంచిన జ్ఞానామృతాన్ని
అణువణువునా జీర్ణించుకున్నవాళ్లు
నీ చేతి చలువతో
నీడనిచ్చే వృక్షానికిమల్లె ఎదిగిన వాళ్లు
నువ్వు చూపినదారిలో వెళ్లి
కీర్తిశిఖరాలను అధిరోహించిన వాళ్లు
అవసానదశలోవున్న
నిన్ను ఆదుకోవడానికి
నిన్ను ప్రేమగా తడిమి
నీకు పూర్వవైభవం కలిగించడానికి
నీ జీవితపు దారిలో
అమావాస్య ముళ్ళను తొలగించి
నీ మోములో
పున్నమి పువ్వులను పూయించడానికి
వస్తారమ్మా
నీ నిజమైన
వారసులు తప్పకుండా వస్తారు



– ఎన్.నరేశ్ చారి
9701334516

## కాకతాళీయంగా...

ఇన్ని అక్షరాలు
ఇన్ని పదాలున్నా
ప్రియురాలికి నా ప్రేమను
వ్యక్తం చేయలేకపోయా
కాకులేనయం
'కాకా' రెండక్షరాల్తో
చక్కగా ప్రేమించుకుంటాయి.

కాలవలు
నదుల చెంగుపట్టుకుని
పరిగెడుతున్నవి
సముద్ర స్నానానికి


ఎన్నిలోహాలను
కరిగించి కలబోస్తె
ఒక సైగల్ గొంతవుతుంది.

దేవుడు
నీకులమేంటని అడగడు
ఆయన నిన్ను అడిగేది
వొక్కటే – భూమ్మీద
ఏం మంచి పని చేశావని



–భూషి కృష్ణదాసు
సెల్:9618069338

## చెట్టు



చెట్టు విలువ తెలుకో ఓమనిషి
దాన్ని నీవు చంపబోకు తెలిసి తెలిసి
ఆత్మీయ నేస్తం చెట్టు అని
అవసరాలు తెలుసుకోని ఆసరాగా చేసుకో.

చెట్టులో అణువణువు మన కొరకే దాచిపెట్టు
చిటారు కొమ్మలోని తియ్యని తేనెపట్టు
వేరులోను ఆకులోన ఔషధాలు దాచిపెట్టు
సురలు నరులు మెచ్చి నట్టి 'కల్లు'నుఅందుచు ఒడసిపట్టు.

ఈ పచ్చని ఈచెట్టే మన ప్రగతికి మెట్టు
పాడుగాలి పారద్రోలి ప్రాణవాయువు ఇచ్చే చెట్టు
అమ్మ జోల పాటలా ఊయల ఆటాలలో ఉరటనిచ్చే చెట్టు
ఫలము నిచ్చి బలమునిచ్చె ఫలితం ఆశించిక చెట్టు.

చెట్టు చేమ చెదిరే పోతే బ్రతికె లేనట్టు
రంపపు కోతలు మాటున విషాదలు కనిపెట్టు
చెయ్యి చెయ్యి కలిపి మొక్కలను నాటు
పచ్చని ఈచెట్లుకే పరవశించే మేఘాలు
కురుపించును వాన జల్లు నేల తల్లి మురిసెటట్టు




–మెరుగు నవీన్ కుమార్
9866231498

పుస్తక సమీక్ష


# కవి యెనిశెట్టి గంగాప్రసాద్- శతక పద్య సుమాలు






గేయ కవి, యెనిశెట్టి గంగాప్రసాద్, సామాజిక మాధ్యమాలలోని వర్తమాన అంశాలను పద్య రూపకాలుగా శతకంగా ప్రచురింపచేసారు. లోకరీతుల వాస్తవాలను ఈ శతకపద్య సామాజిక సుమాలు ప్రతిబింబింప చేస్తున్నాయి. తెలంగాణ రాష్ట్రంలో ఎందరో ఉపాధ్యాయులు, రచయితలుగా, కవులుగా, ఆధ్యాత్మిక, సామాజిక, సందేశాత్మక రచనలను అందరికీ అర్థమయ్యే సులభశైలిలో ప్రచురింపచేయటం అటువంటి సాహితీవేత్తలకు విశేషంగా పాఠకులు ప్రోత్సాహం అందించడం సంతోషం చదగిన సద్విషయం. గంగాప్రసాద్ రచన **'సాహితీ సౌరభాలు సామాజిక పద్యసుమాలు శతకము, ఇతరములు'** పుస్తకంలో, ఆటవెలది, కందం, తేటగీతి పద్య సాహిత్యం 25 శీర్షికలుగా ప్రచురింపచేసారు. పల్లెబాధలు, పల్లెగోస, వంటి పద్యాలతో గ్రామ జీవన నిష్కళంక బ్రతుకుల మాధుర్యాన్ని, పల్లె జీవన ప్రకృతి సౌరభాన్ని ప్రధానంగా ఈ పద్య సంపుటి వెలువరిస్తోంది. 'వినుము మంచి మాట వినిన మేలు' మకుటంతో 136 శతాధిక పద్యాలలో సుభాషితాలను మంచి సందేశాత్మకంగా రూపొందించి అందచేసారు. **"పల్లెటూరు బ్రతుకు భారమని తలచి పట్టణాలవైపు పరుగులేలా?"** అంటూ **"పట్నవాసమంటు పలుమార్లు పలికేవు పల్లెలేక నీకు ప్రగతి లేదు"**అని హెచ్చరిస్తారు. ధనలక్ష్మి–దీపావళి, ఉగాది, కుడుముల తద్దె, నరక చతుర్దశి సందర్భంగా శుభాకాంక్షల పద్యాలు, **"మాతృభాషలోని మర్మమ్ము తెలియక ఆంగ్లభాష వెంట, అమ్మ పాలు ద్రాని అమ్మనే మరచినట్లు అవుతుందని"** సూచిస్తారు. ప్రేమ, ప్రేమకథ, ప్రేమికుల దినోత్సవం, ఓటు, ఎన్నికలు, ఆత్మహత్యలొద్దు అంటూ సామాజిక స్పృహతో **"పద్యము పాటకు ప్రాణము పద్యము విన పరవశించు పరమాత్ముండే"** అంటారు శతక పద్య కవి యెనిశెట్టి గంగాప్రసాద్.

ప్రతులకు: యెనిశెట్టి ప్రసాద్
4-10-153, ఫారెస్ట్ ఆఫీస్ రోడ్
కామారెడ్డి–503 111
సెల్: 98664 47234



–జయసూర్య
సెల్:9014948336
9394775088

# బతుకుబండి (కథ)

రామనాథాన్ని చూస్తుంటే ఏం మనిషిరా బాబూ అనిపిస్తూ ఉంటుంది ప్రసాద్‌కి. ఇద్దరూ ఒకే ఆఫీసులో పనిచేస్తున్నారు. రామనాథానికి దేవుడంటే నమ్మకం ఉంది. గుడికి వెళ్తూ ఉంటాడు. ఎప్పుడైనా ఒకోసారి ఇంట్లో సత్యనారాయణ వ్రతం చేసుకుంటూ ఉంటాడు కుటుంబసమేతంగా.

ప్రసాద్ అందుకు విరుద్ధం. దేవుడంటే నమ్మకం లేదు. అలాంటి నమ్మకం ఉన్నవాళ్ళని చూసి నవ్వుకుంటాడు. కాస్త చులకనగా చూసాడని కూడా చెప్పుకున్నా తప్పులేదు. ఎవరి అభిప్రాయాలు వాళ్ళని అని పట్టించుకోని తత్వం రామనాథానిది. చిన్నతనంనించీ కూడా ఎదుటివాళ్లని విమర్శించడం బాగా అలవాటు ప్రసాద్‌కి. ఇద్దరి ఇళ్ళూ ఒకే వీధిలో ఉన్నాయి. రెండు కుటుంబాల మధ్య రాకపోకలు ఉండటమే కాదు రామనాథం ఒక్కగానొక్క కొడుకు గిరీ, ప్రసాద్ పెద్దకొడుకు రవీంద్ర ఇద్దరూ ఒకే ఈడువాళ్ళు. ఒకే కాలేజీలో కలిసి చదువుతున్నారు. గిరిబైక్ మీద ఇద్దరూ కలిసి తిరుగుతుంటారు. రవీంద్రకి తండ్రి మాటలు వింతగా అనిపిస్తాయి. ఎందుకంటే దేవుడుని నమ్మేవాళ్ళందరినీ విమర్శిస్తాడు. మరి అత్తయ్యని మటుకు విమర్శించడెందుకు అని ఆశ్చర్యం.

అత్తయ్యకి దైవభక్తి ఎక్కువ. ఎప్పుడూ పూజలూ, వ్రతాల్లో మునిగి తేలుతూ ఉంటుంది కదా! పైగా ఎవరో బాబాగారంటే కూడా బాగా నమ్మకం ఉంది. ఔను నిజమే. అలాంటివన్నీ నమ్మవద్దని అందరితో వాదించినట్లు తన అక్కగారితో మాత్రం వాదించడు ప్రసాద్.

అక్కగారి కొడుక్కే తన ఒక్కగానొక్క కూతురిని ఇచ్చాడు మరి. అదీ కారణం.

కొంతమంది తీరు సమాజంలో అలాగే ఉంటోంది. తమ అభిప్రాయాలు భార్య మీదా, బయటివాళ్ళ మీదా రుద్దే ప్రయత్నం చేస్తుంటారు విమర్శలూ వాదోపవాదాల రూపంలో. ఆ కోవకి చెందినవాడే ప్రసాద్.

చిన్ననాటి స్నేహితుడు సోమసుందరం అకస్మాత్తుగా ఆ రోజు తన ఇంటికి రావడం ఆనందాన్నీ ఆశ్చర్యాన్నీ కూడా కలిగించింది ప్రసాద్‌కి. ఎన్నేళ్ళ తర్వాతో ఈ ఊరు రావడమే కాదు తనని మరచిపోకుండా తన ఇల్లు వెతుక్కుంటూ వస్తే సంతోషమే కదా మరి.

కుశలప్రశ్నలు, కాఫీ ఫలహారాలయ్యాక స్నేహితుడి చొక్కా వంక పరికించి చూస్తూ అడిగాడు ప్రసాద్ "ఏవిటి సుందరం! నీకు చిన్నప్పటి నించీ నీలం రంగు అంటే ఇష్టం లేదు కదా మరిప్పుడు నీలంరంగు చొక్కా వేశావేంటి?"

"దానికంత ఆశ్చర్యం ఏవుంది ప్రసాద్! ఇంకొకరికి కష్టంగానీ, నష్టంగానీ కలిగించనంత వరకూ. మనకి మనమే కష్టనష్టాలు కొని తెచ్చుకోనంత వరకూ వ్యక్తుల ఇష్టాయిష్టాలు మారితే తప్పేం లేదు కదా! చిన్నప్పుడు నేను పచ్చళ్ళు తినేవాడిని కాదు. ఇప్పుడు ఎన్ని పదార్థాలున్నా కూడా పచ్చడి లేందే ముద్ద దిగదు" నవ్వాడు సోమసుందరం ఇదేమీ వింత కాదు అన్నట్టుగా చూస్తూ.

"అయితే పెరిగి పెద్దవుతున్న కొద్దీ వయసు పెరుగుతుంటే రూపంలో మార్పులు వస్తున్నట్టే అభిప్రాయాలూ, ఆలోచనలూ కూడా మారే సందర్భాలు ఏర్పడినా ఆశ్చర్యపోవక్కర్లేదంటావా?"

"అంతేగా మరి! మారినా ఆశ్చర్యపోనక్కర్లేదు. మారకపోయినా ఆశ్చర్యపోనక్కర్లేదు".

"ఏవెూ సుందర్! నీ అభిప్రాయంతో నేను ఏకీభవించలేకపోతున్నాను".

"మరేం ఫరవాలేదు. ఎవరి అభిప్రాయాలు వాళ్ళవి. ఇప్పుడిందులో నీ వల్ల నాకు వచ్చిన నష్టం లేదు. నా వల్ల నీకు వచ్చే నష్టం లేదు. దాన్ని గురించి ఆలోచించి మన సమయం వృథా చేసుకోనక్కర్లేదు. ఔనా కాదా?"

**"దేవుడంటే నమ్మకం లేదు. అలాంటి నమ్మకం ఉన్నవాళ్ళని చూసి నవ్వు కుంటాడు"**

ఔనన్నట్లో కాదన్నట్లో తెలియని విధంగా తల ఊపారు ప్రసాద్.

గతంలోకి వెళ్ళింది మనసు.

ఓసారి సంక్రాంతి పండగకి అమ్మా నాన్నగార్ల దగ్గరికి వెళ్తూ ఇద్దరికీ బట్టలు కొన్నాడు తను. అమ్మకి ఆకుపచ్చ రంగంటే చాలా ఇష్టం కదా అని ఆ రంగు చీర కొన్నాడు. పండగకి ఆదివారంతో కూడా కలిపి మూడు రోజులు సెలవలొచ్చాయని అన్నయ్య, వదినా వాళ్ళు కూడా వచ్చారు. వాళ్ళుకూడా అమ్మకి, నాన్నగారికీ బట్టలు తీసుకొచ్చారు. అన్నయ్య తెచ్చిన చీర మెరూన్ రంగుకి బంగారం రంగు అంచుతో మిలమిల మెరిసిపోతోంది. అన్నయ్య స్నానానికి వెళ్లినప్పుడు అమ్మని అడగకుండా ఉండలేకపోయాడు.

మేమిద్దరం తెచ్చిన చీరల్లో నీకేది నచ్చిందో చెప్పు.

నవ్విందావిడ. "రెండూ బావున్నాయిరా.."

"అహ అలా కాదు., నాకేం కోపం రాదులే. రెండింటిలో ఎక్కువ ఏది బావుంది? అంటే ఎక్కువ ఏది నచ్చింది?"

తప్పకుండా తను తెచ్చిన చీరే చెప్తుందని ఆకుపచ్చరంగే కదా తనకి ఇష్టం అని లోపల చాలా గర్వపడిపోతూ పైకి మాత్రం మామూలుగా ఉన్నట్టున్నాడు.

"రెండూ బావున్నాయి. అడిగావు కాబట్టి చెప్తున్నాను. ఈ మెరూన్ రంగుది ఫస్టు.."

చివుక్కుమంది మనసులో. "అదేమిటి నీకు ఆకుపచ్చ రంగు కదా ఇష్టం.."

**"ఆమె ఆక్రోశానికీ, సంధించే ప్రశ్నలకీ అంతులేదు. కానీ కాలం అనే మందు ఒకటి ఉంది"**

"నిజమే! కానీ ఆ రంగు ఇష్టం అని ఎక్కువగా ఆ రంగులోనే కొనుక్కోడంతో అబ్బ! ఆ రంగు చీరలెక్కువ చేరాయి. ఎప్పుడు ఒకే చీర కడుతున్నట్టు అనిపించి విసుగు పుడుతోంది. ఈ మెరూన్ రంగుకి బంగారు రంగు అంచు బాగా మెరుస్తోంది కదూ..."

ఆ మాటలకి మనసులో కాస్త ఉక్రోషపడ్డాడు. ఇలా ఇష్టాయిష్టాలు మారిపోవడం ఏమిటో అర్థం కాలేదు.

"ఏమిటాలోచిస్తున్నావు?" సోమసుందరం ప్రశ్నతో మళ్ళీ వర్తమానంలోకి వచ్చాడు ప్రసాద్.

"ఈ రంగు నీకు అంతగా నప్పలేదు.."

"మరేం ఫరవాలేదు. ఈ ఒక్క చొక్కాతోనే నా జీవితం గడిచిపోదుగా. మా ఆవిడ మనసు కూడా సంతోషపెట్టాలి కదా! తనకి నచ్చినది కొని తెచ్చింది.."

ఇలాంటి భర్తలు కూడా ఉంటారా? ఎదురుగా చూస్తూ కూడా నమ్మలేకపోతున్నాడు ప్రసాద్.

భార్యభర్తలన్నాక ఒకరి అభిరుచులు ఒకరు మన్నించటం జీవితంలో ఒక భాగమని ఎప్పటికీ అర్థం చేసుకోలేకపోతున్నాడు ప్రసాద్. సోమసుందరం తీరేవేరు. భార్య అభిప్రాయం పట్టించుకోవలసిన అవసరం లేదన్న మాట పూర్వకాలం నాటి మాట అతని దృష్టిలో. గతించిన కాలం అది. మారుతున్న కాలంతో పాటూ మగవాడు మంచిని ఆచరించే దిశలో నడవాలన్నది అతని అభిమతం. కానీ తన స్నేహితుడి మాటల్ని సమర్థించలేకపోయాడు ప్రసాద్. అర్థం చేసుకున్న సోమసుందరం ఆ సంభాషణ మరి పొడిగించలేదు. తను పట్టిన కుందేటికి మూడే కాళ్ళు అనే ధోరణిలో కదా ఉంటాడు ప్రసాద్.

ఎన్నేళ్ళ తర్వాతో స్నేహితుడిని కలుసుకున్న ఆనందాన్ని వాదోపవాదాలతో తుడిచెయ్యదల్చుకోలేదు.

కానీ అది మరోలా అర్థం చేసుకున్నాడు ప్రసాద్. తను

**"మారుతున్న కాలంతో పాటూ మగవాడు మంచిని ఆచరించే దిశలో నడవాలన్నది అతని అభిమతం"**

మాట్లాడేదానిలోనే నిజం ఉంది కాబట్టి ఇంకేమి అనకుండా ఊరుకున్నాడని చెప్పుకున్నాడు తనకి తనే.

రాత్రి బస్సుకి తిరిగి వెళ్ళిపోయాడు సోమ సుందరం. అతని మాటలే చెవుల్లో ప్రతిధ్వనిస్తు న్నాయి ప్రసాద్ భార్య లతకి. అతడికి తన భార్యంటే ఎంత గౌరవం. ప్రతి మాటలోనూ భార్యపట్ల అభిమానం. ప్రేమా, గౌరవం మన్నన వ్యక్తమవడం గమనించింది. అదృష్టవంతురాలు ఆమె అనుకుంది.

ఆ రోజు ఆఫీసులో ఉండగా రామనాథానికీ, ప్రసాద్‌కీ కూడా ఒకేసారి ఫోన్ కాల్స్ వచ్చాయి. కబురు వింటూనే ఇద్దరూ కూడా అపోలో హాస్పిటల్‌కి చేరుకున్నారు ఆఘమేఘాలమీద. గిరి రవీంద్రతో కలిసి బైక్ మాద వెళ్తూ మలుపు తిరిగేటప్పుడు లారీ కొట్టేసింది.

స్నేహితులిద్దరూ మృత్యువుతో పోరాడుతున్నారు. అత్యవసర వైద్యం నడుస్తోంది. తల్లులిద్దరూ దుఃఖంతో స్పృహ కోల్పోయే పరిస్థితిలో ఉన్నారు. రామనాథానికి కాళ్ళూ చేతులూ ఆడట్లేదు. ప్రసాద్ వంక పిచ్చి చూపులు చూస్తుండిపోయాడు. మాటే మర్చిపోయినవాడిలా భయం భయంగా గోడ దగ్గర నిలబడ్డాడు ప్రసాద్. ఆ రాత్రి గడిస్తేనే గానీ ఏ సంగతీ చెప్పలేమన్నారు డాక్టర్లు. ఇద్దరికీ గుండెల్లో రాయి పడినట్టయింది.

కన్నవాళ్ళూ కాదు, కట్టుకున్న వాళ్ళూ కాదు, కడుపున పుట్టినవాళ్ళూ కాదు మృత్యువు ఒక్కటే మనిషిని అనునిత్యం వెన్నంటి వచ్చేది. ఔను. ఇది సత్యం. సర్వకాల సర్వావస్థలలోనూ నీడలా వెన్నంటి ఉండేది ఆ మృత్యువు ఒక్కటే.

మర్నాడు తెల్లవారుఝామున కళ్ళు తెరిచిన ప్రసాద్ కొడుకు రవీంద్ర అమ్మా,నాన్నల కళ్ళల్లో కోటికాంతులు నింపాడు. దుఃఖం ఆనందం కలగలిసి చేతులూ జోడించి అప్రయత్నంగా అంది లత భర్తవంక చూస్తూ "దేవుడున్నాడండీ దేవుడున్నాడు. మనల్ని కరుణించాడు. మనబిడ్డని మనకి దూరం చెయ్యలేదు.."

రెప్పలార్చకుండా భార్యవంక చూస్తుండిపోయిన ప్రసాద్‌కి తనకే తెలియదు చేతులు రెండూ జోడించి మనసులో ఆ భగవంతుడిని ధ్యానిస్తూ దుఃఖ భారాన్ని దించుకునే ప్రయత్నం తను మొదలు పెట్టినట్టు.

తన పరిస్థితి వింత గొలిపింది. ఎంతో విచిత్ర మనిపించింది కూడా. నిమిషాల్లో గుండెలోతుల్నించి వచ్చిన ఈ మార్పు. ఎంత సహజంగా ఇమిడిపోయింది తనలో. ఎందరినో విమర్శించిన తాను ఇప్పుడు తనలో కలిగిన అనుభూతికి దాసోహమంటున్నాడు. దీనివల్ల తాను ఇతరులకి కలిగించే నష్టం ఏమీ లేదు కదా! సరిగ్గా అదే సమయంలో గుండెలు బాదుకుంటూ ఏడుస్తోంది రామనాథం భార్య మరో వైపు. "లేదండీ దేవుడు లేదు. మీరెంత ఆరాధిస్తారు? ఎన్నిపూజలు చేస్తారు? ఆ భగవంతుడే ఉంటే మనపిల్లాడు మనకి దక్కేవాడు కాదా? ఈ చిన్న వయస్సులో వాడికి నూరేళ్ళు నిండిపోయేవా? ఇంత ఘోరం ఎక్కడైనా ఉంటుందా?"

ఆమె ఆక్రోశానికీ, సంధించే ప్రశ్నలకీ అంతులేదు. కానీ కాలం అనే మందు ఒకటి ఉంది. ఎంతటి ఆవేదనని అయినా మెల్లిమెల్లిగా తగ్గిస్తూ చల్లటి పూత పూస్తుంది. సంధించే ప్రశ్నలకి సమాధానాలివ్వకుండానే మనిషిని ముందుకి నడిపించేస్తుంది. అదే కాల మహిమ. బహుశా ఒకవేళ ఇదే భగవంతుడేమో!


రామనాథానికి దేవుడిమీద కోపం రాకపోవడం, ఏడాది తర్వాత ఇదివరకులాగే యథాప్రకారం ఇంట్లో పూజ చేసుకోవడం అప్పుడప్పుడు గుడికి వెళ్ళి వస్తుండటం చూస్తుంటే ఆశ్చర్యంగానే అనిపిస్తోంది ప్రసాద్‌కి.

తన కొడుకు గిరి బతికి బట్టకట్టినందుకు దేవుడిని నమ్మేవాళ్ళని విమర్శించడం మానేశాడు తను. కొద్దో గొప్పో మారిపోయాడు తను. ఎందరో ఎన్ని విషయాల్లోనో కుటుంబంలోని వారి కోసం సర్దుకుపోతూ బతుకుబండిని సవ్యంగా నడుపుకుంటుంటే చులకన భావంతో చూసేవాడు కదా తను. ఇప్పుడు తనలో మార్పు వచ్చినందుకు తను మారినందుకు ఏమాత్రం బాధగా లేదు తనకి. కానీ ఉన్న ఒక్క కొడుకునీ కోల్పోయిన రామనాథంలో ఇదివరకటి పద్ధతికి వ్యతిరేకమైన మార్పు రావాలి కదా మరి అలా జరగలేదేమన్న ఆశ్చర్యం కలుగుతోంది.

ఉండబట్టలేక ఆ మాటే మెల్లిగా అన్నాడు ఒక రోజు. చిరునవ్వు నవ్వాడు రామనాథం చేతులు జోడించి పైకి చూస్తూ.

"ఇప్పుడింకా ఎక్కువ అవసరం ప్రసాద్ నాకు. అందులోనే మన శ్శాంతి వెతుక్కుంటాను. మానసికబలం పొందుతాను. దాంతోనే బతుకుబండి నెట్టుకుపోగలుగుతాను.."

జీవితంలోని ఎన్నో కోణాలు ఆ సమాధానంలో గోచరించాయి ప్రసాద్‌కి.



–తమిరిశ జానకి
9441187182

## బాల్యస్నేహం

చలో చలో గెటూగెదరుకు
హలోహలో రింగుల మ్రోతలు
నిండుగా మెండుగా ప్రసన్నవదనపు
శాంతినికేతన్ వారసులై యిల
విరబూసిన విజయవిలాసులు
విద్యార్థులదే కోలాహలం...!

అల్లరి చేష్టల ఆలింగనాలు
ఆఖరి మజిలీ అపరిచితులుగా
వీడలేమంటూ వీడ్కోలంటూ
టాటా చేతుల కులాసగాళ్ళు...!

కాలం తిరగగ ఇరవై ఏళ్ళు
తరగని సిరులకు తమాషగాళ్ళు
మరుపురాక మరువలేక...!
మనసారా కలవాలనీ,
తేనెమాటలమిఠాయి పొట్లం
అందించాలనే ఆతృత వైనం
ఊహల లోకపు ఊరేగింత
ఊయలలలో మన మనసంత
నాట్యమయూరపు హుషారు అడుగులు ...!

నవ నాగరికపుగంధం జల్లుతూ
చడ్డీదోస్తుల కయ్యం నెయ్యం
మూతి తిప్పులు పిడికిలి గుద్దుల
పోట్లాటలతో పోకిరి చేష్టలు
తొండి మొండిగా ఫికరులు ఎన్నో
గత సుద్దులను గారాబంగా
మథనంచేసె మధుర వేటలో...!
తడిముద్దౌతూ మరిమరితలచి
రెక్కలు కట్టుక వచ్చిన పైనం
బహు తరంగుల వలస పక్షులు...!

ఆహా !ఓహో! కేరింతంత
తొలకరి జల్లుల పులకరింతలా
పలుకరింపులో పరవశ హొయలు..!
తనువుల మనసుల
తహతహ తేలిక
అమృత సింధువులాలాపనలో
హాయిగ తేలే సోయిగ మురిసే
కనుల కొలనులో తొణికిసలాడే
మిళమిళ కాంతుల మిసిమే స్నేహం...!



–డా.పాండాల మహేశ్వర్
9912180054

## ఏమిటిదీ?

అందమైన ప్రకృతిలో
విహరిస్తున్న..
నా మనసెందుకో
మందంగా ఉంది,
ఏదోలా అనిపిస్తుంది.
చుట్టూ ఏదో ఆవహించి
చురుకుదనం ఆవిరైంది..
ఇది గ్రహచారమా లేక
నా అపచారమా?

గాలి వీస్తుంది
చిరు వెన్నెల కురుస్తుంది,
చుక్కలుమెరిసే ఆకాశంలో
చందమామ విహరిస్తోంది.
అదే దేశం–ఇదే ప్రదేశం,
అయినా..
ఏదో దిగులుగా ఉంది,
ఆహ్లాదం..
దారికి రానంటుంది,
ఇది ఏదైనా శాపమా..
నను అనుసరిస్తున్న
పాపమా..



–ఎన్.. రాజేష్
9849335757

## ధన్యజీవి

బ్రతుకుటకై యుపాధియును భార్యయు పిల్లలు తల్లిదండ్రులున్
హితమతులైన సోదరులభీప్సితభావనులైన బంధువుల్
సతతము తోడు నిల్చి కొనసాగెడి మిత్రులు గల్గినట్టి భా
గ్యతతికి నోచుకొన్న నరునంతటి ధన్యుడెవండు పృథ్విలో ?



డా॥ అయాచితం నటేశ్వరశర్మ
9440468557.






## ప్రభాతగీతం ఆలపిస్తూ



నవయువతరం పిడికిళ్ళు బిగిస్తునేఉంది
తరాల అంతరాలను గమనిస్తూనే ఉంది
యువస్వరం భాస్వరమై రగలుతునేఉంది
ఉడుకు రక్తం ఉత్సాహంతో ఉరకలేస్తునేఉంది.

అంతరంతరాల అక్షరదీపాలు వెలిగిస్తునేఉంది
కాంతి క్రాంతి తానై ప్రజ్వలిస్తునేఉంది
సమాజం పెనునిద్దరను వదిలిస్తునేఉంది
అసమానతలపట్ల జయభేరి మ్రోగిస్తునే ఉంది.

వివేకానందుని వాణికి జోతలర్పిస్తునేఉంది
అల్లూరి తెగువకు అబ్బురపడుతూనేఉంది
విప్లవాల మెరుపు గర్జనలు వింటూనేఉంది
గురజాడ,శ్రీశ్రీ,కాళోజీలను స్మరిస్తునే ఉంది.

ఆశయాలు,ఆదర్శాలు అనుసరిస్తునే ఉంది
అభ్యుదయం నవోదయం ఆశిస్తూనే ఉంది
యువశక్తికి ధీటు లేదని ఋజువు చేస్తునే ఉంది
లక్ష్యాల సాధనలో అడుగు ముందుకేస్తునే ఉంది.

మరో ప్రపంచపు పిలుపు కోసం తపిస్తునే ఉంది
ఐకమత్యపు బావుటా ఎగురవేస్తునే ఉంది
చితికిన బతుకులకు భరోసాగానిలుస్తునే ఉంది
తొలిపొద్దున ప్రభాతగీతం ఆలపిస్తునే ఉంది.



–డాక్టర్ చక్రపాణి యిమ్మిడిశెట్టి
9849331554

## కలిసి కట్టుగా



ముళ్ళ దారిలో నడుస్తున్నవారము
ఉన్నత ఆశయంకోసం
కృషి చేస్తున్నవారము
ఆటంకాలు ఓ లెక్కనా..!
సమస్యలు ఓ లెక్కనా..!
కష్టాలు కన్నీళ్లు ఓ లెక్కనా..!
జీవిత సమరంలో
ఓటమిలను చవి చూసినవారము
బరువు భాద్యతలను మోసినవారము
అవమానాలను తట్టుకున్న వారము
సవాళ్లు ఓ లెక్కనా..!
ఎదురు దాడులు ఓ లెక్కనా..!
బీటలుపారిన అడుగులు ఓ లెక్కనా..!
విశాలమైన ప్రపంచ పటంలో
మారుమూల పచ్చని పల్లెలో
పేగుబంధమై పెనవేసుకున్న మాతృత్వం
పురిటి నొప్పులతో పునర్జన్మ ఎత్తి
లోకాన్ని పరిచయం చేసిన తొలిదైవము
మన భరతమాత కోసం
ముందడుగై నిలిచే ఆత్మవిశ్వాసం మనకుంది

మనం సైతం మనందరి కోసం
మనం సైతం మన ఆకాంక్షకోసం
మనం సైతం భవితరాల భవిష్యత్ కోసం
ఎటువంటి అవరోధాలు ఎదురైన
యువలోకాన్ని సంఘటితం చేసి
చైతన్యం తెద్దాం పోరాటం చెద్దాం
చైతన్యమే ప్రథమ ఎజెండాగా
కలిసి కట్టుగా శ్రమిద్దాము
కలిసి కట్టుగా నడుద్దాం
యువ ఆలోచనల మేథోశక్తితో
బలం బలగమై ముందడుగై కదులుదాం
కలిసికట్టుగా
అంతిమ లక్ష్యం చేరుకుందాము




–డాక్టర్ పగిడిపల్లి సురేందరు
80748 46063

పుస్తక సమీక్ష

# 'తేనె పదాల తీపిచింత' వచన కవితా సంపుటి "ఊరేగింత"







డా॥ పాండాల మహేశ్వర్, సామాజిక సత్సంగ చింతనతో పేరెన్నికగన్న పద్య కవిత్వానుభవంతో, వచన కవితా సంపుటి **"ఊరేగింత"**గా తన కవితలను పుస్తక రూపంలో ప్రచురింపచేసారు. 85 కవితలలో సమాజంలోని వర్తమాన అంశాలను, తేనె లొలికే భావాలను వచన కవనా రీతులలో వైవిధ్యభరితంగా అందించారు. చైతన్యలహరి సినారె, కైతలకెపుడు దేవుడతడు శ్రీశ్రీ, అజాత శత్రువు అటల్జీ, పోరాటాల వతంసా వంటి స్ఫూర్తి దాతల కవితా రూప ప్రస్తావనలు సందర్భాను సారంగా రాసినవి సంపుటిలో చోటు చేసుకొన్నాయి. **'తెలంగాణ దిల్‌ఖుషీ'**లో హైదరాబాద్ నగర సౌందర్యాన్ని **"మిక్చర్పొట్లం హైదరా బాదీ భారతీయ కల్చర్కే పునాది"**గా ఆంగ్ల, ఉర్దూ పదాల మేళవింపుతో అభివర్ణించారు. కరోనా వైరస్‌పై తస్మాత్జాగ్రత, రామబాణం, సాల్యూట్ సైనికుడా!, చంద్రయాన్ ఇస్రోదక్షత, ఆధార కార్డు వంటి ప్రశంసనీయ భావాల కవితా రూపాలున్నాయి. **"పౌరులకు ఓటే దివ్యాస్త్రం"** అంటూ 'బాదుషాలు'లో ఓట్లేస్తిమి సర్కారుకు పాట్లొచ్చె మన ఊళ్ళకు "టోపీలు"లో **"ఒట్లొచ్చి నపుడే కోట్ల పండుగైతే ఎలా?"** మనిషిలో **"హామీల ఎరవేసి గాలాల పట్టేసి వద్దన్న ఓట్లంటు నోట్లు సీసీలు ఇస్తూనే పాట్లు పెంచే"** ఊసరవెల్లుల పదవీకాంక్షల రాజకీయాలను సూటిగా ప్రశ్నిస్తారు. నిరీక్షణ కవితలో **"నూతన రాష్ట్రమాయె ఉద్యోగాలు రాకపాయె"** **"తలచుకుంటె గుబులాయె భవిష్యత్తు కంగారాయె"** అంటూ నిరుద్యోగుల ఉద్వేగాన్వేషణ వివరిస్తారు. 'ఇంటి దైవం'లో ప్రజాస్వామ్యానికి గంతలు కట్టి దళారులకు టిక్కట్టిచ్చి– దైవం లాంటి ఓటరుపై నిందలా?" రాజకీయ నాయకులను హెచ్చరిస్తారు. త్రిపుల్‌పై నిందలా?" రాజకీయ నాయకులను హెచ్చరిస్తారు. త్రిపుల్ ఐటీ బాసర విద్యార్థిని మానస, **'వత్తులు'** కవితలో

**"పాఠాలను కూడా పాటలుగా బోధిస్తూ**
**మా అక్షర దీపాల వత్తులను వెలిగించిన**
**మా నవజీవన భాస్కరుడు**
**మా పాండాల మహేశ్వర్రారు.."** అంటారు. కవి, ఉత్తమ అధ్యాపకుడు, పర్యావరణ ప్రియుడు, యాదాద్రి, మహేశ, తేట తెలుగు, పంచాక్షరీ వంటి శతక, గేయ, వచన కవి డా॥ పాండాల మహేశ్వర్ వ్యక్తిత్వ ఔన్నత్యాన్ని, కవితా తత్త్వాన్ని ఊరేగింత సంపుటి ప్రతిబింబింప చేస్తోంది.

**ప్రతులకు:**
డా॥ పాండాల మహేశ్వర్
ఇ.నెం. 1-53, గౌసుకొండ
ఇ.నెం. 13-29 ఎం
ప్రకాష్‌నగర్ కాలనీ
భూదాన
పోచంపల్లి–508 284
సెల్: 99121 80054



–జయసూర్య
సెల్:9014948336
9394775088

# కలము కత్తి



మదిలోని భావాలను కవ్విస్తుంది
బంధాలను పెనవేస్తుంది కవిత్వంతో
కలము సిరను చిందించి
అక్షరాలకు పురుడు పోస్తుంది.

ప్రసవించిన అక్షరాలు
ఆత్మీయతతో ఆదరిస్తాయి
కలము ఉప్పొంగితే
అవినీతి పరుల గుండెల్లో ఉప్పెనే
రక్తపాతాన్ని పారించకున్నా శిక్షిస్తుంది.

ఇది అక్షరాల నిధి ఆనందాల పల్లకి
భవిష్యత్ తరాలకు వారధి
కదిలిస్తే పారుతుంది కవిత్వపు నదిలా

ఆయుధం బంధాలను విడదీసి బాధిస్తుంది
కత్తి కన్నెర్ర చేస్తే

హడలిపోతారే గాని ఆదరించరు

కత్తి రక్తాన్ని చిందింపజేసి
ఆయుష్షును హరిస్తుంది
భయంతో బాధిస్తుంది కనికరం లేకుండా
కలము కాలాతీతం కత్తి ప్రమాద గీతిక.



-చాపల మహేందర్
9949864152

# అంటు రోగం

బుల్లితెర సీరియల్స్ ఆడవా ళ్ళ
ఆటవిడుపుగా మారిపోయింది,
సీరియల్స్ చూడకుండా రోజే గడవని పరిస్థితి
నెలకొంది,
అంటురోగంలా ఇంటింటా అల్లుకున్న
బుల్లితెర చిత్రాలు దినదినాభివృద్ధి చెందుతూ
ఆడవాళ్ళ మనసులను అల్లకల్లోలం చేస్తూ
కుటుంబాల్లో కలకలం రేపే విధంగా
చూపడం శోచనీయం,
ఆడవాళ్లను విలన్లుగా చూపడం
వాళ్ళను అగౌరవ పర్చడం కాదా?
బుల్లితెర నిర్మాతలు వ్యాపారరీత్యా
సమాజాన్ని ఉద్ధరించే విధంగా
బాటలు వేయాలి గానీ
సమాజాన్ని కూలద్రోసే విధంగా
చూపడం అమానుషం?
ఈ బుల్లితెర చిత్రాల వలన
కుటుంబ పరంగా భార్యాభర్తలు
తల్లీబిడ్డలు, అక్కచెల్లెళ్ళు,
అన్నదమ్ముల మధ్య
రక్తసం బంధీకుల పలకరింపులు
మచ్చుకైనా కానరాకపోవటం శోచనీయం,
డబ్బే ప్రధానంగా భావించే
బుల్లితెర నిర్మాతల్లో మార్పురావాలి,
ఈ టి.వి.సీరియల్స్ వలన
రాత్రి చదువుకునే వీలులేక
పిల్లలు ఇబ్బందుల పాలవుతున్నారు,
సమాజాన్ని
తప్పుదారి పట్టించే విధంగా కాకుండా
మంచి మార్గంలో పయనించడం
నీతి, నిజాయితీకి కొమ్ముకాయడం
విలువలు వంటబట్టే విధంగా చూపడం
మానవత్వమనిపించుకుంటుంది,
ప్రతి ఒక్కరూ దేశపురోభివృద్ధికై
పాటుబడాల్సిన బాధ్యత
ఎంతైనా ఉంది.



-రాయవరపు సరస్వతి
7989665525

# ఎప్పటికో...!

ఆనంద తరంగాలు
అగుపించేదెప్పుడో
ఆకలి కేకల నినాదాలు
ఆగేదెప్పటికో....!

పీడిత యెదపొంగులు
తగ్గేదెప్పటికో
ఉద్యమ భావాల ఉధృతి
ఆగేదెన్నటికో......!

రాజకీయ రచ్చలకు
ముగింపు యెప్పటికో
పదవులె లక్ష్యంగా
ప్రణాళికలు ఆగేదెన్నటికో!

పాలన మరిచిన నేతలు
రంగస్థల ప్రసంగాలు
రగడల విషాదాగ్ని
చల్లారుట యెప్పుడో!

జనజీవన ప్రవంతిలో
జరుగుబాటు యెప్పుడో
సాయం యిక చాలని
చెప్పగలుగుటెప్పుడో!

ఉచితం నిరంతరమన
ఉద్యమాలు ఆగబోవు
అభివృద్ధికి ప్రణాళికల
ముగింపుల ముచ్చటయే
ఉండబోదు...!



-యెనిశెట్టి గంగా ప్రసాద్.
9866447234.

# సమ్మిళితులు

(కథ)

“గుజరాతీ వాళ్లసలే డబ్బు మనుషులు. వాళ్లల్లో నువ్వు ఇమడగలననే అనుకుంటున్నావా? నువ్వు గనుక ఆ సంకర సంబంధం చేసుకుంటానంటే, మన వాళ్లల్లో ఎన్ని తలవంపులు? నీ తర్వాత పుట్టిన ఇద్దరు పిల్లలకు సంబంధాలు కుదిరేనా?”

“చూడమ్మా! ప్రేమకూ ఆకర్షణకూ మధ్య తేడా తెలుసుకునేంత అనుభవం నీకు లేదు. ప్రేమ వివాహాలు ఫెయిలైపోవడానికి ముఖ్య కారణం, పరస్పరాకర్షణతో దగ్గరైన జంటలు, ఆ తర్వాత అవగాహనా లోపంతో దూరమౌతారు”

వంటలపై, ఆతిథ్యంపై కొందరు వధువు తరపు బంధువులు పేచీ పెట్టుకునే ప్రయత్నం చేశారు. వారిని మందలించి, పరిస్థితిని అదుపులోకి తెచ్చాడు కృష్ణబాబు.

“ఏమ్మా! ఇంతాలస్యమైంది?” తులసి గొంతులో ఆందోళన.

“చెప్పను గదమ్మా, సాయంత్రం సందేశ్ ఇంటికి వెళ్లాలి, వచ్చేసరికి ఆలస్యమౌతుందని?” దీప్తిలో చిరాకు.

“ఔను గదూ? నేనే మరిచిపోయాను. ఎందుకింత ఆలస్యమైందా? అని గాభరా పడ్డాను. సందేశంటే, ఆ డాక్టరీ చదుతున్న అబ్బాయేనా?”

“ఔనమ్మా, అతనే. నా పుట్టిన రోజున మనింటికి పార్టీకొచ్చినపుడు పరిచయం చేశా గదా?”

“అప్పుడు పరిచయం చేశావు సరే, ఇప్పుడు వాళ్లింట్లో ఏం ఫంక్షనుందని వెళ్లావ్?”

“వాళ్లమ్మ పుట్టిన రోజు సందర్భంగా నన్ను వాళ్ల కుటుంబానికి పరిచయం చేద్దామని సందేశ్ నన్ను ప్రత్యేకంగా ఆహ్వానించాడు”.

ఆ మాటలతో తులసిలో అనుమానం రేకెత్తింది. దీప్తి ఏదో గూడుపుఠానీ చేస్తుందని సంశయం కలిగింది.

“నిజం చెప్పు. నీలో ఏ ప్రత్యేకత ఉందని నిన్ను, వాళ్ల కుటుంబానికి పరిచయం చేసే అవసరం వచ్చింది?”

“అవసరం ఉంది గనుకనే పిలిచారమ్మా. ఎన్నో రోజులనుంచి నీతో చెప్పాలనుకుంటూనే దాటవేశాను. ఇప్పుడు ప్రసక్తి వచ్చింది కాబట్టి చెబుతున్నాను. సందేశ్, నేను ప్రేమించుకున్నాం. సర్జరీలో తన పీజీ తర్వాత, నా ఇంజినీరింగ్ డిగ్రీ తర్వాత, పెళ్లి చేసుకోవాలనుకుంటున్నాం. వాళ్ల కుటుంబంలోని వారందరూ ఒప్పుకున్నట్టే. మీరు కూడా ఒప్పుకుంటే కథ సుఖాంతమౌతుంది”. నవ్వుతూ అంది దీప్తి.

“నీకు నవ్వులాటగా ఉందేమో గానీ, నాకిక్కడ ప్రాణం మీదికొచ్చినట్టుగా ఉంది. అటు మన ప్రాంతం కాదు, ఇటు మనముంటున్న మహారాష్ట్ర కాదు. చూసి చూసి ఆ గుజరాతీ వాడి వెంట పడ్డావేంటే? గుజరాతీ వాళ్లసలే డబ్బు మనుషులు. వాళ్లల్లో నువ్వు ఇమడగలననే అనుకుంటున్నావా? నువ్వు గనుక ఆ సంకర సంబంధం చేసుకుంటానంటే, మన వాళ్లల్లో ఎన్ని తలవంపులు? నీ తర్వాత పుట్టిన ఇద్దరు పిల్లలకు సంబంధాలు కుదిరేనా? హవ్వ. హవ్వ. ఎంత గడుసుదానివే? నంగి నంగిగా ఉంటూ ఎంత గ్రంథం నడిపించావే? మీ నాన్న రానీ నీ పని చెబుతాను.” అని సోఫాలో కూలబడి బోరున ఏడవసాగింది తులసి. ఆమెనలాగే వదిలి, తన గదిలోకి వెళ్లింది దీప్తి.

అరగంట తర్వాత ఫ్రెష్ ఐ తన గదిలోంచి దీప్తి బయటకు వచ్చేసరికి తులసి వెక్కుతూ, వంటింట్లో ఏదో పని చేసుకుంటోంది. దీప్తిని చూసి, మొహం అటు వైపుకు తిప్పుకుంది.

“అమ్మా! ఆపని వదిలెయ్. అది తర్వాత మనిద్దరం కలిసి చేసుకుందాం.” అని బలవంతంగా తన తల్లిని హాల్లోకి తీసుకవచ్చి, సోఫాలో కూర్చుండబెట్టింది.

“చూడమ్మా! మీ తరానికీ మా తరానికీ ఆలోచనా సరళిలో ఎంతో వ్యత్యాసం ఉంది. సాంప్రదాయ కుటుంబంలో పుట్టిన మీకూ, ముంబయి లాంటి కాస్మోపాలిటన్ సిటీలో పుట్టి ఇక్కడే ఇరవై ఏళ్లకు పైగా గడిపిన మాకూ, ఆలోచనల్లో భేదాలుండడం సహజం. ప్రపంచమే ఓ కుగ్రామంగా మారుతున్న ఈ కాలంలో, కులాలు, మతాలు, భాషలు లెక్కలోకి రావు. ఇంకా, ప్రేమ అనేది, కులమతాలకతీతం. అదొక అపూర్వమైన అనుభవం. అనిర్వచనీయం. అన్నీ ఆలోచించుకుని ప్రేమలో పడితే, అది వ్యాపారమౌతుంది కాని, ప్రేమ కాదు. గుడ్డొచ్చి తల్లిని వెక్కిరించినట్టుగా, ముగ్గురు పిల్లల్ని కన్న నాకే నీతులు చెబుతున్నావా? అని నువ్వన్నా, నేనన్నది మాత్రం నిజం. అందుచేత, మా సిసలైన ప్రేమను ఆశీర్వదించమ్మా.” అంటూ తల్లి ఒడిలో ఒరిగిపోయింది దీప్తి. గువ్వలా ఒదిగిపోయిన కూతురిని హత్తుకుంటూ తులసి..

“చూడమ్మా! ప్రేమకూ ఆకర్షణకూ మధ్య తేడా తెలుసుకునేంత అనుభవం నీకు లేదు. ప్రేమ వివాహాలు ఫెయిలైపోవడానికి ముఖ్య కారణం, పరస్పరాకర్షణతో దగ్గరైన జంటలు, ఆ తర్వాత అవగాహనా లోపంతో దూరమౌతారు. పెళ్లికిముందు పచ్చగా కనిపించిన బొమ్మలో, పెళ్లై బాధ్యతల బొరుసు బయటపడేసరికి, బెంబేలెత్తిపోతారు. ఒకరితో ఒకరు సర్దుకుపోలేక పంతాలకుపోయి, విడిపోతారు. అలాంటివారిని ఎంతమందిని చూడలేదు? అందుకని నా మాటవిని, ఆ గుజరాతీ అబ్బాయిని మర్చిపో.”

“అది జరిగే పని కాదమ్మా. మాది కేవలం పై పై మెరుగుల ఆకర్షణ కాదని ఖచ్చితంగా చెప్పగలను. మా మొదటి పరిచయంలోనే ఒకరిపై ఒకరికి ఇష్టం ఏర్పడ్డా, అది గట్టిపడడానికి కొన్ని నెలలు పట్టింది. మా ఆలోచనల్లో, అభిరుచుల్లో, అభిప్రాయాల్లో చాలా సామ్యం ఉంది. మూడేళ్లనుంచి మేము కలిసి తిరుగుతున్నా, సందేశ్ ఎప్పుడూ హద్దులు మీరింది లేదు. ఆ మాత్రం విచక్షణ మాలో ఉంది. గత ఆరునెలల్నుంచి వాళ్లింట్లో, మా విషయమై చర్చ జరుగుతోంది. నా గురించి, మన కుటుంబం గురించి వాళ్ల పరిచయస్తులద్వారా తెలుసుకునే వారొప్పుకున్నారు. కావాలంటే మీరూ వారి గురించి వాకబు చేయండి. మీకు సంతృప్తి కలిగితేనే సమ్మతించండి. కేవలం వాళ్లు గుజరాతీయులని మాత్రం, మా సంబంధానికి అడ్డు చెప్పకండి. వాళ్ల కుటుంబ నేపథ్యం నచ్చితేనే, సందేశ్ గురించి పూర్తిగా తెలుసుకున్న తర్వాతే, మా పెళ్లికి పచ్చ ఝెండా ఊపండి. ఇంకో విషయం. ఉభయ కుటుంబాల సమ్మతితో, మీ ప్రమేయంతోనే మేము పెళ్లి చేసుకుంటాం తప్ప, పారిపోయి ఏ గుళ్లోనో రిజిస్ట్రాఫీస్ లోనో వివాహం చేసుకోం. ఈ విషయంలో మా ఇద్దరికీ స్పష్టత ఉంది. నేను చెప్పేది చెప్పాను. నిర్ణయం మీపై వదిలి పెడుతున్నాను.” అని లేచి, వంట గది వైపు అడుగులేసింది దీప్తి.

కృష్ణబాబు ఆఫీసునుండి వచ్చి, భోంచేసి, తమ పడక గదిలోకి వెళ్లి ఏదో పత్రిక చేతులోకి తీసుకున్నాడు. వంటిల్లు సర్ది తులసి కూడా ఆ గదిలోకి వచ్చింది. భర్తను హత్తుకుని తనివితీరా ఏడ్చింది. ఆమె శాంతించిన తర్వాత విషయం రాబట్టాడు కృష్ణబాబు. తులసి చెప్పిందంతా సావధానంగా విని “చూడు తులసీ! మన ఆలోచనలూ, అభిప్రాయాలూ పిల్లలపై రుద్దే రోజులు కావివి. ఈ విషయం సంవత్సరం క్రితం, చూచాయగా చెప్పింది దీప్తి. అది ప్రేమా, పెళ్లి గురించి ఆలోచించే సమయం కాదనీ, తన దృష్టంతా చదువుపైనే పెట్టమని చెప్పాను. డిగ్రీ తర్వాత, ఆలోచిద్దామని కూడా చెప్పాను. విషయం నీ దాకా చేరనీయవద్దని హెచ్చరించాను. అసలే సున్నితమైన నీ మనసును కష్టపెట్టవద్దని హితబోధ చేశాను. ఇంకో మూన్నెళ్లలో ఫైనలియర్ పరీక్షలు అయిపోతాయి కాబట్టి, ఆ తర్వాత ఆలోచిద్దాం. ఈ లోగా నేను నా మిత్రుల ద్వారా అబ్బాయి గురించి, వారి కుటుంబం గురించి కనుక్కుంటాను. ఈ విషయం నాకు వదిలెయ్. నువు నిశ్చింతగా ఉండు. అనవసరంగా ఆలోచిస్తూ నీ ఆరోగ్యం పాడు చేసుకోకు.” తులసిని ఇంకా దగ్గరకు తీసుకుంటూ అన్నాడు కృష్ణబాబు.

దీప్తి, ఫైనలియర్ పరీక్షలపై దృష్టిపెట్టి చదవ సాగింది. కృష్ణబాబు, జైన్ కుటుంబం గురించి తెలుసుకునే పనిలో పడ్డాడు. వారి గురించి సంతృప్తికర సమాచారమందగానే, దీప్తికి తెలియజేయకుండా జైన్ పరివారాన్ని కలిశాడు. సందేశ్ తో అరగంట మాట్లాడాడు. కట్నకానుకల గురించి కదిపాడు. వాళ్లకసలు ఆ ఉద్దేశ్యమే లేదన్నారు. పెళ్లి, రిసెప్షన్ ఖర్చు కూడా చెరిసగం పెట్టుకుందామన్నారు. కృష్ణబాబు ఆనందానికంతు లేదు. స్వీట్, హాట్ తీసుకుని ఇంటికి చేరిన కృష్ణబాబుని విషయమేంటని అడిగింది తులసి.

“మన దీప్తి రొట్టె విరిగి, నేతిలో పడింది తులసీ! మనమెంత గాలించినా దీప్తికి సందేశ్ లాంటి అబ్బయిని తేలేము. మనవాళ్లలో అంతటి సంస్కారం అరుదు. ప్రేమ వివాహాల్లో కూడా దొరికినకాడికి దండుకుందామని చూస్తారు, కాని సందేశ్ తల్లిదండ్రులు మాత్రం, చిదిమి దీపం పెట్టుకులా ఉండే మీ దీప్తి, మా ఇంటి వెలుగైతే చాలు, మాకు వేరే కట్నం వద్దు’ అన్నారు. ఈ విషయంలో మన దీప్తి ఎంపికపై నాకు గర్వంగా ఉంది. నిజంగా మన భుజం నుండి పెద్దభారం దిగినట్ట యింది. వచ్చే ఆదివారం మన ముగ్గురు పిల్లల్ని తీసుకుని, గొర్రై బీచ్ కెళదాం. సందేశ్ వాళ్లను కూడా ఆహ్వానిద్దాం. అప్పుడు నువ్వూ వాళ్లని కలిసి ఒక అవగాహనకు రావచ్చు.”

“ఇంద ఈ శుభ ఘడియలో నీ నోరు తీపి చేస్తా” అని ఓ కాజూ కత్లీ ముక్క, సగం తన నోట్లో పెట్టుకుని, మిగతాసగం, తులసి నోటికందించాడు. తులసి సిగ్గు మొగ్గైంది.

గొర్రై, బోరీవలి ప్రాంతంలోని సముద్రం ఒడ్డున ఓ కాటేజ్ బాడుగకు తీసుకుని, దీప్తి కుటుంబం, సందేశ్ కుటుంబం స్థిర పడ్డారు. ఇంటి నుండి తెచ్చిన తినుభండారాలతో బ్రేక్ ఫాస్ట్ చేసి, పిల్లలు సముద్రం ఒడ్డుకు ఆటలాడడానికి వెళ్లారు. పెద్దలు కాటేజ్ లోనే ఉండి, ఒకళ్ల గురించి ఒకరు తెలుసుకున్నారు. వారి మాటల్లో కొందరు కామన్ మిత్రులున్నారని తేలింది. వారింకా దగ్గరయ్యారు. మంచి ముహూర్తం చూసి నిశ్చితార్థం చేద్దామనీ, ఇద్దరూ తమ తమ ఉద్యోగాల్లో స్థిరపడ్డ తర్వాత పెళ్లి చేద్దామని అనుకున్నారు. మధ్యాహ్నం లంచ్ తర్వాత కాస్త విశ్రాంతి తీసుకుని, తేలికపడ్డ మనసులతో వెనక్కి తిరిగారు.

ఇరు కుటుంబాల మధ్య రాకపోకలు మొదలయ్యాయి. తులసి, కృష్ణబాబుల వివాహ రజతోత్సవానికి సందేశ్ కుటుంబ సభ్యులు, వారి దగ్గరి బంధువులు అంతా కలిసి పాతిక మందిదాకా ఆహ్వానింపబడ్డారు. ఆ సంబరంలో దీప్తి, సందేశ్ ల సాన్నిహిత్యం చూసి, తులసి, కృష్ణబాబుల వైపు చుట్టాలు చెవులు కొరుక్కున్నారు. ఆ విషయమై ఆరా తీశారు కాని, దీప్తి కుటుంబసభ్యులు నోరు మెదపలేదు. ఈ రోజుల్లో కాజెజి మిత్రులమధ్య ఆ మాత్రం దగ్గరి తనం సహజమేనని కొట్టిపారేశారు.

సందేశ్ బంధువులు, దీప్తి కుటుంబ్బాన్ని తమ ఇళ్లకు ఆహ్వానించసాగారు. పిలవడానికి వచ్చినపుడు స్వీటు, హాటు తేవడం, వారి ఆతిథ్యం స్వీకరించి తిరిగి వచ్చేటప్పుడు ఆడవారికి పసుపు కుంకుమలతోపాటు జాకెటు ముక్క, మగవారికి డబ్బున్న కవరు ఇవ్వడం, వారి ఆనవాయితీ అని తెలుసుకున్నారు. వారు మొదటిసారి తమింటికి వచ్చినప్పుడు కేవలం టీ, ఫలహారాలతో సరిపుచ్చినందుకు సిగ్గుపడ్డారు. ఆ తర్వాత మాత్రం, తులసి కూడా వారి ఆచారాల ప్రకారం నడుచుకోవడం మొదలుపెట్టింది. తమింటికి వచ్చినప్పుడు భోజనంలో తెలుగు పిండివంటలైన చేగోడీలు, సకినాలు, గారెలు, బూరెలు, కజ్జికాయలు మొదలైన వాటితో ఆతిథ్యం ఇవ్వసాగింది. అలాగే వారు, గుజరాతీ వాళ్ల వంటకాలైన ఖమణ్, ఢోక్లా, దాల్వడా,కడీ, ఫాఫ్డా, జలేబి, తీపి ఆవకాయ చుందా, మొదలగు వంటకాలు ఆస్వాదించసాగారు.

దీప్తి ఫలితాలు రాగానే, క్యాంపస్ లో ఎంపికచేసిన, ఓ బహుళ జాతి కంపెనీలో సాఫ్ట్ వేర్ ఇంజినీర్ గా చేరింది. సందేశ్ మూడు నాలుగు కార్పొరేట్ ఆస్పత్రిలకు సర్జన్ గా సేవలందించ సాగాడు. ఆదివారాలు సాయంత్రాలు మాత్రం, దీప్తి, సందేశ్ లు తమకై కేటాయించుకున్నారు. చౌపాటీకో, జుహు బీచ్ కో, నాష్నల్ పార్క్ కో, మఢ్ ఐలండ్ కో, అక్సా బీచ్ కో పోయి స్వీట్ నథింగ్స్ చెప్పుకుంటూ, తమ మధ్య పెరిగిన సాన్నిహిత్యాన్ని ఆస్వాదించసాగారు. తమ లోని సంస్కారం హెచ్చరించగా, ఎప్పుడూ హద్దులు దాటలేదు.

దీప్తి, సందేశ్ ల నిశ్చితార్థానికి కేవలం దగ్గరి బంధువులనే ఆహ్వానిం చారు. ఓ స్టార్ హోటల్లో జరిగిన ఆ ఫంక్షనుకు ఇరు కుటుంబాలవారు కలిసి, వందకు మించి హాజరు కాలేదు. ఆ అంతర్రాష్ట్రీయ సంబంధ కబురు విని, దీప్తి కుటుంబ దగ్గరి బంధువులు అవాక్కయ్యారు. ఆ ఫంక్షన్ లో వాళ్లిద్దరు కలిసి తిరుగుతున్నప్పుడే ఏదో ఉందని మేమనలేదూ? పిదప కాలం, పిదప బుద్ధులు. మనవాళ్లల్లో కుర్రాళ్లు గొడ్డుపోయారా? అని చాటుగా చెవులు కొరుక్కున్నారు. దీప్తికి సంపన్న కుటుంబానికి చెందిన, పీజీ నేర్చిన డాక్టర్ సంబంధం కుదిరినందుకు, కొందరు అసూయతో రగిలిపోయారు. కట్న కానుకలు లేవనేసరికి ఇంకా కుళ్లుకున్నారు. ఆ సంబంధం, అటు సందేశ్ బంధువుల్లో కూడా కలకలం రేపింది. ఆ మధ్య, కొన్ని గుజరాతీ కుటుంబాల్లో అంతర్రాష్ట్ర పెళ్లిళ్ళు తరచుగా జరగడం వల్ల, అది వాళ్లల్లో సంచలనం సృష్టించలేదు. మొత్తం మీద, తెలుగు, గుజరాతీ సమ్మేళనంపై, మిశ్ర స్పందనలు వినబడ్డాయి. నిశ్చితార్థం మాత్రం వేడుకగా, గుజరాతీల సాంప్రదాయం ప్రకారం జరిగింది. ఇరు కుటుంబాల మధ్య బంధం మరింత గట్టి పడింది.

దీప్తి, సందేశ్ లు ఇంకా తరచుగా కలుసుకోసాగారు. దీప్తి సందేశ్ నుండి గుజరాతీ నేర్చుకుంటే, సందేశ్, దీప్తి నుండి తెలుగు నేర్చుకోసాగాడు. జైన్ లకు ఉల్లి, వెల్లుల్లి, భూమిలోపల పండే ఆలూ, కందమూలాలు నిషిద్ధం కాబట్టి, దీప్తి కూడా వాటిని త్యజించింది. అటు సందేశ్, మన ఘాటు కూరలకు అలవాటుపడ్డాడు. రెండు కుటుంబాల వారిదీ సర్దుకుపోయే తత్వం కావడంతో, వారి మధ్య సయోధ్య కుదిరింది. చూస్తుండగానే పెళ్లిరోజు రానే వచ్చింది. పెళ్లి గుజరాతీ ఆచారం ప్రకారం జరిగినా, మన పద్ధతి ప్రకారం వధూవరులచేత, ఒకరొకరి తలలపై జీలకఱ్ఱ, బెల్లం పెట్టించారు. దాదాపు వేయి మంది ఆహుతుల మధ్య, దీప్తి, సందేశ్ ల పెళ్లి, ఓ ఏసీ ఫంక్షన్ హాల్లో అట్టహాసంగా జరిగింది. అక్కడే సాయంత్రం రిసెప్షన్ కూడా, కనులపండుగగా జరిగింది.

వంటలపై, ఆతిథ్యంపై కొందరు వధువు తరపు బంధువులు పేచీ పెట్టుకునే ప్రయత్నం చేశారు. వారిని మందలించి, పరిస్థితిని అదుపులోకి తెచ్చాడు కృష్ణబాబు. కొందరు విఘ్నసంతోషులు ప్రతిచోటా ఉంటారని, తులసిని సముదాయించాడతను.

తెలుగింటి ఆడపడుచు, గుజరాతీ ఉమ్మడి కుటుంబంలో అడుగు పెట్టింది. సందేశ్ వాళ్ల ఇద్దరు బాబాయిలు, వాళ్ల పిల్లలు అంతా కలిసి పదిహేను మంది ఒకే ఇంట్లో ఉంటారు. ఆరు పడకగదుల ఆ ఇంట్లో, ఒక్కటే వంటగది. పనిమనుషులున్నా, కొన్ని పదార్థాలు ఇంట్లోని ఆడవారు, ఇష్టంతో చేస్తారు. దీప్తి కూడా, వారి వంటలు నేర్చుకోసాగింది. అంత మందితో కలిసి ఉండడం, మొదట్లో కాస్త ఏదోలా ఉన్నా, రాను రాను ఆ వాతావరణంలో ఇమిడిపోయింది దీప్తి. అప్పుడప్పుడు అభిప్రాయభేదలొచ్చినా, మళ్లీ వేంటనే వారంతా కలిసిపోవడం దీప్తికి బాగా నచ్చింది. దీప్తి సంపాదన, సందేశ్ కుటుంబానికి అవసరం లేకపోయినా, ఆ అమ్మాయి చదువుకు సార్ధకత కల్పించడం కోసం, ఉద్యోగంలో కొనసాగమని ప్రోత్సహించింది సందేశ్ తల్లి వందన.

సందేశ్ కు ప్రభుత్వాసుపత్రిలో ఉద్యోగం వచ్చింది. దానికి అనుబంధంగాఉన్న మెడికల్ కాలేజిలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా కూడా నియమితుడయ్యాడతను.

దీప్తి పుట్టింటికి పోయినప్పుడు సమయమంతా, అత్తారింటి ముచ్చట్లతోనే గడిచిపోయేది. అంత పెద్ద ఉమ్మడి కుటుంబంతో ఎలా వేగుతుందో అని ఆందోళన పడ్డ తులసి, తమకూతురు సంతోషంగా ఉండడం చూసి, ఆనందభరితమైంది. పెళ్లికి ముందున్న ఆమె అనుమానాలూ, అపోహాలూ పటాపంచలయ్యాయి. కూతురు విచక్షణపై నమ్మకమున్న కృష్ణబాబు మాత్రం దీప్తి అత్తారింట్లో ఇమిడిపోయినందుకు అంతగా ఆశ్చర్యపడలేదు.

మొదటి మూడేళ్లు కుటుంబ నియంత్రణ పాటించినా, ఆ తర్వాతి అయిదేళ్లలో ఇద్దరు పిల్లలకు జన్మనిచ్చింది, దీప్తి. మొదటి కూతురు పుట్టగానే ఉద్యోగానికి రాజీనామా చేసింది. తన దృష్టిని కూతురు పెంపకంపై కేంద్రీకరించింది. తన కూతురు ధృతికి అటు గుజరాతీ, ఇటు తెలుగు నేర్పింది. పెద్ద బాలశిక్ష, వేమన పద్యాలు, సుమతీ శతకం పిల్లల పాటల వీడియోల ద్వారా, అమ్మయికి మన సంస్కృతిని పరిచయం చేసింది. అలాగే గుజరాతీలో పంచతంత్ర కథలు, నర్సీ మెహతా పాటలు, జాతక కథల వీడియోల ద్వారా, గుజరాతీ ఆచారాల పట్ల అవగాహన కల్పించింది. ఎవరూ ప్రత్యేకంగా చెప్పక పోయినా, ధృతి, అమ్మమ్మ తాతయ్యలతో తెలుగులో, నానమ్మ, తాతయ్యలతో గుజరాతీలో మాట్లాడసాగింది.

ఇప్పుడు దీప్తి ధారాళంగా మాట్లాడుతుంది. సందేశ్ మాత్రం తెలుగు అర్థం చేసుకోగలిగినా, తెలుగులో మాట్లాడడానికి జంకుతాడు.

ధృతి తర్వాత పుట్టిన అబ్బయికి, ఇద్దరు తాతయ్యల పేర్లు కలిసి వచ్చేట్టుగా హేతల్ బాబు అని నామకరణం చేశారు. దీప్తి, తమ పిల్లలతో పాటు, కుటుంబంలోని ఇతర పిల్లల చదువుపై కూడా శ్రద్ధ చూపడంతో, అత్తారింటి అభిమానాన్ని చూరగొంది.

సందేశ్ కుటుంబం సమ్మిళితుల కుటుంబంగా రూపాంతరం చెంది, ఓ కొత్త ఒరవడికి శ్రీకారం చుట్టింది. ఏ పరిస్థితుల్లోనైనా, సర్దుబాటు తత్వం విజయంవైపుకు దారి తీస్తుందని మరోసారి నిరూపితమైంది.

(ఇది వాస్తవ సంఘటనల ఆధారంగా రాయబడిన కథ.)



-అంబల్ల జనార్దన్
సెల్:09987533225/
8850349858

# దైవం - అమ్మ



దైవం మనిషిని సృజించి
ఇక నా బదులు మిమ్మల్ని చూసేదీ
పోషించేది ఆమే అని
భరోసా ఇచ్చి ప్రతి ప్రాణిని
భూమి పైకి
జీవితం ప్రసాదిస్తాడు
శారీరక శక్తి చాలక
కనురెప్పలు మూస్తూ
తెరుస్తూ పాలతో
ప్రాణం సూత్రాన్ని అమ్మ
విదులుస్తున్న కొద్దీ
ఏమీ తెలియని
అజ్ఞాన కూపంలోంచి
మెల్ల మెల్లగా ప్రాకుతూ
పైకి వస్తూవుంటారు
జీవులు
శిశు కౌమార్య
యవ్వనావస్థలన్నీ
దాటుతూ...
ఎంత ఎదిగినా అమ్మ
అమర్చిన
సూత్రం తోనే సూర్యుళ్ల లా
ఓ వెలుగు వెలుగుతారుగా...
అమ్మ లేనిదే సృష్టి లేదుగా
కృష్ణుడైనా రాముడైనా
అమ్మ ఆధారంతో
దైవాలయ్యారుగా...
అమ్మదనం దైవత్వం
అందుకే అద్భుతాలు
అమూల్యాలు
ఆమె లేనిదే అసలు
ప్రపంచం లేదు
జీవితం లేదు
అర్థం చేసుకోలేనంత
మహత్తు అమ్మది
అమ్మను ఆమె బాధ్యత నెత్తిఁగి దేవుడు
ప్రానుపడిపోయాడు-



-డా చిట్యాల రవీందర్
7798891795

# సప్తవర్ణాల చేనేత దారం

మేడిపండులో
మేలిరత్నంలా ప్రజా జీవితంలో
వెలుగు పంచిన చేనేతరంగం
వేలకుటుంబాలకు ఆధాయమార్గంగా .

కార్పొరేట్ రక్కసి పాదాలక్రింద నలిగి
ప్రభుత్వాల నిర్లక్ష్యపు
నిర్వీర్యానికి కొన ఊపిరితో
కొట్టుమిట్టాడుతున్నాయి...!

ఎన్నికలవేళ నేతలు, అధినేతలు
తమ భవిష్యత్తుకై గుప్పించే హామీలు,
వాగ్దానాల మూటలు..
నేడు తూటాలై గుండె కోతలై
దుర్భర జీవితాలుగా
చేనేత మగ్గాల వస్త్రాల వెలుగులు
వెతలుగా మారి
జీవితాల్ని చింపేస్తున్నాయి...!

ఉమ్ముతో
నిలుంబేక పోగుల్ని అతికించిన
మునివేళ్ళ నేర్పు...
ముక్కుపైకొచ్చి మూలాలను తర్కిస్తుంది..!

చేనేత రంగానికి
చేతనత్వాన్ని నింపి
చేయూతనిచ్చేదెవరనీ..?

వన్నెతగ్గిన కార్మికుల బతుకుల్లో
సప్తవర్ణాల చేనేత దారానికి
బలాన్ని చేకూర్చేదెవరనీ...?

గజేంద్రమోక్షంలా గజం నేతగాళ్ళ
జీవన యాతనలను తీర్చే
అనాథ రక్షకుడెవరనీ...?

కుదేలైన రంగాన్ని
కుదురుకునేటట్లు జేసే కూర్మావతారునికై.
ఎదురు చూపులు ఎన్ని నాళ్ళోననీ?

దారిద్ర్యాన్ని రూపుమాపే
దామోదరుడేడున్నాడోననీ?
కార్మికుల కష్టాల్ని కడతెర్చే
కార్తికేయుడెపుడొస్తాడోననీ ...?

ఉపవాసాలే శరణ్యమా...
ఆశాభావమే అభ్యుదయమా
మెతుకు బాటకై
వెతుకులాట ఎంతకాలమనీ....?
చింతనంలో నిట్టూర్పులే
శాంతి మనోహరంగా....!!



-డా.పాండాల మహేశ్వర్
9912180054

# ఓడిపోని కాలం తో....

ఏమైనా కానీ
నేను కాలంతో పోటి పడుతూనే ఉంటా
ఎన్ని గాయాలు కానీ
ఎదురిడుస్తూనే ఉంటా..
కాలం పెట్టె పోటీకి
సిద్ధంగా ఉంటా....
గుండెకు ఎన్ని
ఆటు పోటులు వచ్చిన
కనిపించని గాయం మానకున్న
అలుపెరుగని పోరాటం చేస్తు
ఓడిపోని కాలంతో
కన్నుల్లో కన్నీళ్లు ఇంకి పోయిన
సాగిపోతూనే ఉంటా...



-ఎలగొండ రవి
9848770345

# నాయకుడు



నాయకుడంటే?.
బీరు పోసి, బిర్యానీ ఇచ్చి ఎగదోసే వాడుకాదు
నాయకుడంటే
నాల్గు మాటలు నీకు జెప్పి రెచ్చగొట్టే వాడుకాదు
నాయకుడంటే
అనుచరులతానణగదొక్కి అందలాలెక్కేవాడు కానేకాదు
నాయకుడంటే
పేదసాదను పిప్పిచేసి పెద్ద పదవులు పొందేవాడు కాదుకాదు
నాయకుడంటే
నగవుమోము నీకు జూపి నాగ విషమును చిమ్మేవాడు కానేకాదు
నాయకుడంటే
అవసరమైతే సేవకునిలా సమాజాన్ని సేవించేవాడు
అవసరమొస్తే అరివీరభయంకరుడై న్యాయాన్ని నిలిపేవాడు.
బుద్ధి కుశలతలో కార్యదక్షతలో మేటిగా నిలిచేవాడు.
విషయపరిజ్ఞానంలో ఉన్నతుడైఉండేవాడు.
వ్యవహారజ్ఞానంలో మిన్నయై నిలిచెవాడు.
అచ్చం రామబంటు అంజన్నలా ఉండగలిగేవాడు.
నాయకుడంటే?
లోకుల కష్టాలన్నీ ఓర్పుతో వినేవాడు
వారి బాధలన్నీ నేర్పుతో పరిష్కరించేవాడు
నాయకుని రూపు ధీర గంభీరం
నాయకుని నడత మేరునగధీరం
నాయకుడంటే మార్గదర్శి
నాయకుడంటే క్రాంతదర్శి
నాయకుడంటే దిక్సూచి
నాయకుడంటే దీపస్తంభం
రథసారథిగా ఉన్నా, రథికునిలా మారినా,
చెర్నాకోల పట్టినా,చక్రంపట్టినా,
రాయబారం నెరపినా, రాజకీయమే చేసినా
ఆ జగన్నాయకునిలా ధర్మరక్షణ చేసేవాడే
నిజమైన నాయకుడు.



-వకుళాభరణం రాంనరేశ్ కుమార్.
9492682285

# నిజమైన గెలుపు


క్షణం తీరికలేని బ్రతుకులు
ప్రతిక్షణం బ్రతుకు పోరాటాలు
తనవాళ్ళ కోసమే ఆలోచనలు
పరుల గురించి పట్టించుకునే
తీరికలు లేవు
ఇవీ నేటి జీవితాలకు సజీవసాక్ష్యాలు......

ఆస్వాదించే మనసులకు
ముసుగులేసుకుని
ప్లాస్టిక్ నవ్వులను పెదవులపై అతికించుకుని....
నిస్వార్థపు జాడ తెలియని
దారులకుండా పయనమే నేటి జీవనం......

గమ్యాలు చేరాలనే ఆరాటంలో
గతి తప్పుతున్న జీవన విధానాలు
మదినిండా స్వార్థాల పందిరిని అల్లుకుంటే...
మానవత్వపు మల్లెలు పూసేది ఎన్నడు.....

లక్ష్యాలు చేరుకునే ముందు
ఒక్కసారి తిరిగి చూడు....
నీకంటూ మిగిలింది ఏమిటి?
నీ వెన్ను తట్టి నిన్ను మెచ్చుకునే వారు ఎవరు అని...?

ఇప్పటికైనా గమనించు మిత్రమా
అందరినీ కలుపుకుపోయే మనస్తత్వాన్ని అలవర్చుకో.....
అందరి కోసం బ్రతకడం నేర్చుకో
అప్పుడే నీ జీవితానికి నిజమైన గెలుపు....



-కళావతి కందగట్ల
9948263004

# ఇదెక్కడి న్యాయం

మంచి చెయ్యకపో
చెడు మాత్రం చెయ్యకు
మొక్కని నాటకపో
చెట్టుని మాత్రం కొట్టకు
నువ్వు చదవకపో
చదివేవాడిని చెడగొట్టకు
నువ్వు పని చెయ్యకపో
పని చేసేవాడిని చెడగొట్టకు
నువ్వు చెడిపో కానీ..
సమాజాన్ని నాశనం చెయ్యకు

హక్కులు అడుగుతున్నావు
నిజమే కానీ...
బాధ్యతలు విస్మరిస్తున్నావు
ఇదెక్కడి న్యాయం.



- దేవరకొండ లక్ష్మీనారాయణ
-8985869475

# మేము మార్చగలం

మేము అనుకుంటే
అమావాస్యను
పున్నమిలా మార్చగలం
అంధకారంలో
వెలుగును నింపగలం
భగభగ మండే అగ్నిశిఖను
చల్లని మంచుతో కప్పగలం
మేము తలచుకుంటే
డాక్టర్లు కాగలము
ఇంజనీర్లు కాగలము
ఒక సైంటిస్టు అవ్వగలం
చిక్కుముళ్ళలో పడున్న ప్రజలకు
బంగారు బాట చూపగలం
కులమతాల కోసం కొట్లడుతున్న మనుషులకు
వెలుగు పథాన్ని సృష్టించగలం
కొండలను పిండి చేసే వీరులం మేము
యుద్ధాన్ని గెలిచె యోధులం మేము
ఓ సమాజమా!
మేము తోటలో అప్పుడే
వికసించిన విరులం
మేము చరిత్రను సృష్టించగలం
అదే చరిత్రను మార్చితీర్చిదిద్దగలం
నేటి వీరులం మేమే
రేపటి మార్గదర్శకులం మేమే



-బి.భూపాల్
-9వ తరగతి
-జి.ప.ఉ.పా.రంగంపేట
హామీ పత్రం:

